క్లుప్తంగా

రైతులకు అండగా ప్రభుత్వం

మధురపూడి: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని జగన్ ప్రభుత్వం ఆదుకుంటోందని రాజానగరం ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. తడిసిన, మొక్కవచ్చిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తుపాను కారణంగా మినుము, పెసర, తదితర పంటలు సైతం తడిసినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వం రైతులు పక్షపాతిగా వ్యవహరిస్తోందన్నారు.

రెడ్‌క్రాస్ దినోత్సవం

ప్రకాశం నగర్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం రెడ్‌క్రాస్ స్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి పర్యవేక్షణలో లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాస్, సభ్యులు కె.వీరలక్ష్మి, శ్రీదేవి, కె.చిన్నిబాబు పాల్గొన్నారు.

సీతానగరం పీహెచ్‌సీ పరిశీలన



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న సోమవారం సందర్శించారు. అక్కడ రిజిస్టర్లను, పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈరోజు ఓపీకి 45 మంది వచ్చారన్నారు. డాక్టర్లు, సిబ్బందికి మండల గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలకు వెళ్లారన్నారు. వచ్చిన రోగులకు ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్ వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయని తెలిపారు. భవనం పైకప్పు మరమ్మతులకు మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు కేటాయించామని, త్వరలో భవనం మరమ్మతులు ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు గుర్రాల కృష్ణారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

17న ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

రాజానగరం: జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ నిర్వహించనున్నామని ఎంపీడీఓ బి.రామారావు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు మండలంలో గ్రామ సభలు నిర్వహించి, ఆయా ప్రాంతాల్లో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ చేస్తారన్నారు. ఎక్కడైనా, ఏవిధమైన అవకతవకలు జరిగినా ప్రజలు ప్రశ్నించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఏ అగస్టీన్ కుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సీతానగరం: రఘుదేవపురంలోని డాక్టర్ సత్య రమేష్‌బాబు హాస్పిటల్ వద్ద జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సత్యం రమేష్‌బాబు హాస్పటల్లో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు డాక్టర్ సత్యం రమేష్‌బాబు, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, అడ్వకేట్ గొట్టిముక్కల అనంతరావు, పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



సీతానగరం గ్రంథాలయంలో చిన్నారులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులను ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.భాస్కరరావు, జ్యోతి ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయంలో సరస్వతి చిత్రపటానికి పూజలు చేశారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, గ్రంథాలయోద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

మాజీ ఎమ్మెల్యే పెందుర్తి పర్యటన

రాజానగరం: మండలంలోని రామస్వామిపేట, పల్లకడియం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ సోమవారం పర్యటించారు. పార్టీపరంగా ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో మండలానికి చెందిన టీడీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి పరీక్ష.. భూమికి రక్ష

- మట్టి నమూనా సేకరణపై అవగాహన తప్పనిసరి
- భూసార పరీక్షలతో ఎరువుల ఆదా



అనపర్తిలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

అనపర్తి: ఆరోగ్యకర పంటలు పొందాలంటే మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువులు వినియోగానికి ప్రతి రైతు భూసార పరీక్ష చేయించాలి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వినియోగిస్తుండడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి తన సహజ లక్షణాలు కోల్పోయి ఉత్పాదక శక్తిని కోల్పోయి భూమి చౌడు బారడంతోపాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి సేకరణ తీసుకోవాల్సిన జాగ్రతలపై మండల వ్యవసాయశాఖ అధికారులు అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు.

మట్టి నమూనాలు సేకరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పంట కోతలు పూర్తయిన తరువాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు తీసి పంపాలి.
- పొలాలకు సాగు నీరు పెట్టినపుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించకూడదు.
- పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, చేలగట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయరాదు.
- ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి.
- వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి దీనిలో పై పొర నుంచి కింది వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అర కేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తరువాత పాలథీన్ కవర్‌లో నింపి రైతుల వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం , గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్షా కేంద్రాలకు పంపాలి.

భూసార పరీక్షలతో ఉపయోగాలు

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలుసుకుంటారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత (ఎలక్ట్రికల్ కండక్టవిటీ), నేల ఆమ్ల, క్షార గుణాలు, పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును తెలియజేస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడి సాధించుకునే అవకాశం ఉంటుంది.

నమూనాల సేకరణ ఇలా..

- ప్రభుత్వ సూచనల మేరకు గ్రిడ్ విధానంలో నమూనాలు సేకరిస్తున్నారు. దీని ప్రకారం డెల్టా ఏరియా సుమారు ఆరున్నర ఎకరాలకు, మెట్ట ప్రాంతాల్లో సుమారు 25 ఎకరాలకు ఒక నమూనా సేకరించాలి.
- వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

భూసార పరీక్షలు ఎంతో మేలు



భూసార పరీక్షలు చేసుకోవడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. ఈ పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు, ఎరువులు వాడాలో తెలుస్తుంది. భూసారాన్ని బట్టి పంటలు వేయడం వల్ల ఆరోగ్యకర పంటలతోపాటు దిగుబడి బాగుంటుంది. రైతులు సొంతంగా మట్టి నమూనాలు సేకరించి రాజమహేంద్రవరం మార్కెట్ యార్డులోని భూసార పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది.

–బి.సురేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి, అనపర్తి

ఘనంగా రెడ్డి సంక్షేమ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొంకుదురు రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. తొలుత బుడతల మామిడి వద్ద త్రిముఖ లింగేశ్వర స్వామికి పూజలు చేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. సినీ నిర్మాత కొవ్వూరి వెంకరామారెడ్డి(88) అధ్యక్షుడిగా, తాడి చిన్నబాబు రెడ్డి కార్యదర్శిగా 25 మంది కార్యవర్గంతో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి త్రినాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రుడా చైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి, స్పీకర్ ప్రత్యేక అధికారి పడాల సత్యనారాయణరెడ్డి, సర్పంచి సత్తి వీరమణి, మాజీ ఉపసర్పంచి కోవ్వూరి వేణుగోపాల రెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా నల్లమిల్లి బుచ్చిరెడ్డి వ్యవహరించారు.

ఈకేవైసీ చేయించుకోండి

అనపర్తి: పింఛనుదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని అనపర్తి ఉప ఖజానా అధికారి దాక్షాయణి ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు ఎవరికి వారు ఈ నెల 11వ తేదీలోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు ఉప ఖజానా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



సంపత్‌నగరంలో గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సంపత్‌నగరంలో గడపగడపకూ..

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని సంపత్ నగరంలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకున్నారు. గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు ఏఏ కుటుంబానికి ఏమేరకు అందాయో వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గ్రామంలో ఇంతవరకు రూ.5.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

రైతులకు భరోసా

అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులను కలుసుకుని ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా భరోసానిచ్చారు. తడిసిన, మొలకలొచ్చి, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసేలా సీఎం జగన్ ఆదేశాలిచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లంక అమ్మిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మండారపు వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వర్రావు, లంక ఆదినారాయణ, మాచర్రావు, వెంకన్న, నాగేశ్వర్రావు పాల్గొన్నారు.

కత్తితో పొడిచిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డబ్బులు ఇవ్వలేదని కత్తితో పొడిచి గాయపరిచిన నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా కట్టని ఎడల మరో ఆరునెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020 అక్టోబరు 26న రాజమహేంద్రవరం స్వామి థియేటర్ సమీపంలోని పాన్‌షాపు వద్ద మొప్పడి రాధాకృష్ణ సిగరెట్ కాల్చుకుంటున్నాడు. అతడి వద్దకు రెల్లిపేటకు చెందిన కిలారి పాండురంగ సాయినాథ్ వచ్చి డబ్బులు అడిగాడు. అయితే లేవన్నాడన్న కోపంతో రాధాకృష్ణను సాయినాథ్ చాకుతో పొడిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ ఎస్సై బి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం కేసు విచారణకు రావడంతో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణరావు సాక్షులను ప్రవేశపెట్టగా, ఫిర్యాది తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్‌జడ్జి ఎస్.పవన్ కుమార్ పైవిధంగా తీర్పునిచ్చారు.

న్యాయవాదిపై దాడి అమానుషం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సత్యసాయి జిల్లా హిందూపురంలో అడ్వకేట్ కమిషన్‌పై పోలీసుల దాడికి నిరసనగా అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. న్యాయవాదులందరూ ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వెల్ఫేర్ సొసైటీ స్టేట్ జనరల్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, న్యాయవాదులు దర్భా సుజాత, బీర అరుణ్ కుమార్, బత్తుల రాజు, దారా ఆదిశేషు, కె.రాంప్రసాద్, పి.లావణ్య, ఎం.నాగేంద్ర పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన లారీ

కొవ్వూరు: ఆగి ఉన్న కారును గ్యాస్ ట్యాంకర్ ఢీ కొట్టిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కొవ్వూరు పట్టణ శివార్లలోని గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో రాజమహేంద్రవరంలోని తాడితోట ప్రాంతానికి చెందిన ఎం.కుమారి, ఆమె భర్త రమేష్, చెల్లెలు దేవి, వారి తల్లి గాయపడ్డారు. వివాహానికి హాజరయ్యేందుకు కుమారి, ఆమె కుటుంబ సభ్యులు కారులో రాజమహేంద్రవరం నుంచి బయల్దేరారు. గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి కారులో ఆయిల్ అయిపోయింది. దీంతో కారును రోడ్డు పక్కనే ఆపి ఆయిల్ కోసం వెళ్లారు. ఈ సమయంలో ట్యాంకర్ లారీ కారుని ఢీకొట్టడంతో కారులో ఉన్న నలుగురూ గాయపడ్డారు. వారిని రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలపారు.

క్రికెట్ టోర్నీ విజేత గాడాల



క్రికెట్ టోర్నీ విజేత గాడాల టీమ్‌కు కప్ అందిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు

రంగంపేట: పెద్ద దొడ్డిగుంట గ్రామంలో గత 20 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం అనూరు, గాడాల టీమ్‌ల మధ్య ఫైనల్ జరిగింది. ఈ ఫైనల్‌లో గాడాల టీమ్ విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన గాడాల టీమ్‌కు అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు కప్‌ను, విన్నర్ ప్రైజ్‌మనీ రూ.20 వేలను అందించారు. రన్నర్స్‌గా నిలిచిన అనూరు టీమ్‌కు రూ.10 వేలు అందించారు. ఈ టోర్నీని సత్య అకాడమీ డైరెక్టర్ కొండేపూడి సత్యనారాయణ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ మడికి లక్ష్మి, సింగంపల్లి సొసైటీ డైరెక్టర్ కొండేపూడి వీర వెంకటరావు, మాజీ సర్పంచ్ మల్లెల వీర్రాఘవ, ఉప సర్పంచ్ పంట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: సచివాలయం ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని, లేకుంటే వారిపై తగు కఠిన చర్యలు తీసుకుంటారని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి హెచ్చరించారు. ఆయన కై కవోలు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో రికార్డులు, హాజరపట్టిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో విధులకు హాజరై బయోమెట్రిక్, హాజరుపట్టిలో సంతకాలు చేయాలన్నారు. పలు గ్రామాల్లో ఉద్యోగులు విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారని, విధులపై నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వారు తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి చిన్ని, ఇతర సిబ్బంది ఉన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



రంగంపేట గ్రంథాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

రంగంపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ వేసవి విజ్ఞాన తరగతులు ఉపయోగపడతాయని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్ నుంచి దృష్టి మరల్చి విద్యపై ఆసక్తి చూపాలని, విద్య ద్వారా మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ, అలవడుతాయని, ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

స్పందనకు నాలుగు అర్జీలు



తహసీల్దార్ అమ్మాజీకి వినతిపత్రం అందిస్తున్న కుందేటి వెంకట రమణ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వాకాడ అమ్మాజీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో నాలుగు అర్జీలు అందినట్టు తహసీల్దార్ అమ్మాజీ తెలిపారు. వడిశలేరు గ్రామానికి చెందిన వినజమూరి జయమ్మ పింఛను ఇప్పించాలని, కోటపాడు గ్రామ పంచాయతీకి చెందిన చెట్లను అనుమతి లేకుండా తొలగించారని ఫిర్యాదు చేశారన్నారు. వడిశలేరు గ్రామానికి చెందిన కుందేటి వెంకటరమణ, ఎస్టీ రాజాపురం గ్రామానికి చెందిన తేలి అప్పారావు సర్వే నంబరు 139లోని భూమి తనకు చెందిందని, తన భూమి తనకు అప్పగించాలని, చంద్రేడు మాదిగ కాలనీలో వర్షపునీరు నిలిచి ఉండిపోతుందని ఇబ్బంది పడుతున్నామని, వెంటనే చర్యలు చేపట్టాలని మాదిగ కాలనీ వాసులు అర్జీలు సమర్పించినట్టు ఆమె తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు అర్జీలు బదిలీ చేసినట్టు అమ్మాజీ తెలిపారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి రాంగోపాల్

గోకవరం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రాంగోపాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి మూడు అర్జీలు రాగా వాటిని పరిశీలించి ఆయాశాఖల అధికారులకు బదలాయించారు. అనంతరం గోకవరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కేఎస్ఎస్ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగి అజయ్ మృతి బాధాకరం



మాట్లాడుతున్న ఎస్‌బీఐ యూనియన్ నాయకులు

సీతానగరం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ బ్రాంచ్‌లో సీనియర్ అసోసియేట్ చిట్టూరి అజయ్ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో సోమవారం ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సంత మార్కెట్ బ్రాంచ్ మేనేజర్ పాలపర్తి శ్రీలత, ఉద్యోగులు, ఖాతాదారులు మౌనం పాటించి, సంతాపం తెలిపారు. బ్యాంక్‌లో ఖాతాదారులకు మంచి సేవలు అందించిన ఉద్యోగిని కోల్పోవడం విచారకరమన్నారు. అజయ్ భార్యకు త్వరలోనే ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు. కేకే అవధాని, క్రొవ్విడి శ్రీనివాసరావు, డీఎస్ పేరిశాస్త్రి, జేఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీసీ సమస్యల పరిష్కారానికి పోరాటం

సీటీఆర్ఐ: బీసీ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేయడంతో పాటు బీసీ మహిళా విభాగం పటిష్టతకు కృషి చేస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సుశీల మార్గాని చెప్పారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనపై నమ్మకంతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈనెల 5న తనను ఈ పదవిలో నియమించారన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి కృష్ణయ్య చేస్తున్న పోరాటానికి అందరూ కలిసి రావాలని కోరారు. బీసీ మహిళల్లో చైతన్యం తీసుకు వచ్చి వారి పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు, రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లద్దిక మల్లేష్, ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం లీగల్ సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి పిల్లి రమాదేవి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కెళ్ల శ్రీదేవి, సిటీ కన్వీనర్ పులవర్తి దేవిక, ఉపాధ్యక్షురాలు రత్నకుమారి, జిల్లా యూత్ అధ్యక్షుడు మేడిశెట్టి దుర్గ ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మేడిశెట్టి కనక మహాలక్ష్మి, నగర ప్రెసిడెంట్ ఆవల తులసి, సిటీ యూత్ ప్రెసిడెంట్ మార్గాని భాస్కర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు నందిని పాల్గొన్నారు.

క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి క్రికెట్ శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: క్రికెట్‌లో జిల్లా వ్యాప్తంగా ఉత్తమ క్రీడాకారులను గుర్తించి ఎంపిక చేసేందుకు నెలరోజుల పాటు క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోచ్ జీరి హరినాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన శిబిరానికి జిల్లా వ్యాప్తంగా 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూన్ 5వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో అండర్ 12 విభాగంలో 65 మంది, అండర్ 14 విభాగంలో 35 మంది, అండర్ 16 విభాగంలో 30 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ రెండు విడతల్లో శిక్షణ అందజేస్తామని హరనాథ్ రెడ్డి తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ బి.సత్యనారాయణ నేతృత్వంలో కొనసాగే ఈ శిబిరంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, కోరుకొండ, కడియం, ధవళేశ్వరం తదితర ప్రాంతాల నుంచి 120 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, వికెట్ కీపింగ్, రన్నింగ్‌తో పాటు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తామన్నారు.